సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



'ప్రజావాణి'కి అభాగ్యురాలు

చేతిలో సంచి, అందులో పాత వస్త్రాలు, ఆధార్, ఇతర జిరాక్స్ పత్రాలతో ఓ అభాగ్యురాలు ప్రజావాణికి వచ్చింది. 8లో▸



ఫ్లెక్సీల వివాదం

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదంగా మారింది. బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



చేసేది చీటింగ్స్!

ఎంటెక్ చదివిన ఓ వ్యక్తి ఓ డమ్మీ కంపెనీ ఏర్పాటు చేశాడు. ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడ్డాడు. 8లో▸

పూడ్చేస్తాం ఆక్రమిస్తాం..!

వాగులు, చెరువులు ఏదీ వదలం

అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.. కావేవీ కబ్జాలకు అనర్హం అన్నట్టు ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేసేస్తున్నారు.. చివరికి వాగులు, చెరువులు, కుంటలను సైతం వదలడం లేదు.. దర్జాగా ఆక్రమించేస్తున్నారు.. వెరసి ప్రజా ధనం, ప్రకృతి సంపద కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోతోంది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. – ఇబ్రహీంపట్నంరూరల్/కొత్తూరు

- మట్టి పోసి, రాళ్లు నింపి యథేచ్ఛగా ఆక్రమణ
- బఫర్ జోన్‌ను సైతం వదలని అక్రమార్కులు
- కబ్జా చెరలో ఆదిబట్ల మున్సిపల్ పరిధి ఎంపీపటేల్ గూడలోని పులందరి వాగు, కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వలోని పెద్ద చెరువు
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



పులందరి వాగులో మట్టి పోస్తున్న టిప్పర్

కబ్జా చెరలో పులందరి వాగు

ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో ఉన్న పులందరి వాగు ఆక్రమణకు గురైంది. ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి ఎంపీపటేల్‌గూడ మీదుగా మంగళపల్లి నుంచి మల్శెట్టిగూడలో ఉన్న చెక్‌డ్యాంకు ఈ వాగు నుంచే నీరు పారుతుంది. కాలువపై మట్టి పోసి కిలోమీటర్ మేర కబ్జా చేశారు. అక్రమార్కులు ఆనవాళ్లు లేకుండా చేయాలని చూస్తున్నారు. ఎంపీపటేల్‌గూడ పట్టణానికి ఆనుకొని ఉన్న చోట సుమారు 500 మీటర్ల మేర కబ్జా కోరులు టిప్పర్లతో మట్టి తెచ్చి కాలువను నింపేశారు. బఫర్ జోన్‌లోనే నిర్మాణం చేపట్టారు. దీంతో కాలువ మొత్తం కుంచించుకుపోయింది. వర్షాకాలం వస్తే పెద్ద ప్రవాహం వచ్చే కాలువ చిన్నగా అయిపోయింది.

ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం

గతంలో కాలువను మరోచోట కబ్జా చేసి పైపులు వేశారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో పైపులు తొలగించారు. తాజాగా టిప్పర్లతో మట్టి తెచ్చి పోస్తున్నారు. కాలువను కబ్జా చేస్తున్నారని ఆదిబట్ల మున్సిపాలిటీలో, కలెక్టరేట్‌లో ఎంపీపటేల్‌గూడ వాసులు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఓవైపు మున్సిపాలిటీ అధికారులు అండర్ డ్రైనేజీ నీరు ఇదే వాగులోకి కలిపి కలుషితం చేశారని, మరోవైపు కబ్జా పాలవుతున్న పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇలాగే వదిలేస్తే వాగు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువను పరిరక్షించాలని కోరుతున్నారు.

మట్టి తీసేయాలని ఇప్పటికే చెప్పాం

పులందరి వాగులో మట్టి పోసిన మాట వాస్తవమే. బఫర్‌జోన్ మొత్తం మట్టితో నింపేశారు. ఇప్పటికే వాగును పరిశీలించాం. మట్టి తొలగించాలని సమయం కూడా ఇచ్చాం. వినకపోతే కేసులు నమోదు చేయిస్తాం. దీనిపై ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు సైతం చేశాం.

– హరిత, ఇరిగేషన్ ఏఈ, ఇబ్రహీంపట్నం

చర్యలు తప్పవు



వాగు కబ్జాపై ఫిర్యాదులు అందాయి. వాగు విస్తీర్ణంపై సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. రెవెన్యూ, ఇరిగేషన్ సర్వే అనంతరం హద్దు రాళ్లు పాతి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. కబ్జాకు పాల్పడితే సహించేది లేదు.

– బాలకృష్ణ, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్



చెరువు కట్టపై వేసిన బందరాళ్లు

చిన్నదైన 'పెద్ద' చెరువు

సుదీర్ఘకాలం పాటు నీటితో కళకళలాడిన కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వలోని పెద్ద చెరువు పూర్తిగా రియల్ వ్యాపారులు, మైనింగ్ నిర్వాహకుల కబంధ హస్తాల్లోకి వెళ్లింది. చెరువు శిఖంలో ఆక్రమణలతోపాటు స్టోన్‌క్రషర్ నిర్వాహకులు యథేచ్ఛగా రాళ్ల వ్యర్థాలు పారబోస్తున్నారు. రికార్డుల్లో మాత్రమే చెరువు భద్రంగా ఉంది. క్షేత్రస్థాయిలో గుట్టలు, వెంచర్‌లోని ప్లాట్లు దర్శనమిస్తున్నాయి. అప్పట్లో మైనింగ్ వ్యాపారులకు స్థానిక నాయకులు, కొందరు అధికారులు తోడవడంతో పది ఎకరాల్లో విస్తరించిన చెరువు ప్రస్తుతం ఐదెకరాలు కూడా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి, చెరువును పరిరక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఇన్ముల్‌నర్వలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 254లో సుమారు 10.6 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తరించి ఉంది. పదేళ్ల క్రితం చెరువు సమీపంలో ఏర్పాటైన ఓ గ్రానైట్ క్వారీ నిర్వాహకులు మైనింగ్ అనంతరం వచ్చే బండరాళ్లను చెరువు కట్టతో పాటు చెరువులో పడేశారు. బండరాళ్లపై మట్టి పోసి తమ వాహనాల రాకపోకల కోసం చదును చేశారు. మరోవైపు సర్వే నంబర్లు 249, 250, 251లో చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్‌లోనే ఓ భారీ వెంచర్ ఏర్పాటు చేశారు. ఏకంగా చెరువు శిఖంలోనే ప్లాట్ల రాళ్లను పాతారు. చెరువు ఆక్రమణలు, పూడ్చివేతలతో ఉనికిని కోల్పోతున్నప్పటికీ అటు హెచ్ఎండీఏ, ఇటు ఇరిగేషన్ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు.

చాలా వరకు కబ్జా



గ్రానైట్, రియల్ వెంచర్ ఏర్పాటు కాకముందు పెద్ద చెరువులోకి వర్షపు నీరు చేరేది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నా చుక్క నీరు చేరడం లేదు. చెరువులో బండరాళ్లను వేయడంతో పాటు వెంచర్ నిర్వాహకులు ఎఫ్‌టీఎల్ లెవల్‌లోనే రాళ్లు పాతి ప్లాట్లుగా మార్చారు. చెరువు శిఖం చాలా వరకు కబ్జాకు గురైంది.

– అజయ్‌నాయక్, మాజీ సర్పంచ్, ఇన్ముల్‌నర్వ

సర్వే చేయిస్తాం



ఎఫ్‌టీఎల్ లెవల్ పట్టాభూముల్లో ఉన్నప్పటికీ వెంచర్లు ఏర్పాటు చేయడం, కట్టడాలు నిర్మించడం చేయరాదు. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్‌ను సర్వే చేస్తాం. ఎఫ్‌టీఎల్ లెవల్‌లో వెంచర్ ఉంటే చర్యలు తీసుకుంటాం. వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే ముందు వినియోగదారులు అన్ని అనుమతుల గురించి తెలుసుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్

నందిగామ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులకు చిన్నవయస్సులోనే పర్యావరణ స్పృహను పరిచయం చేయాలని కామన్‌వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సస్టెనబిలిటీ ఇన్ క్లాస్ రూమ్' కార్యక్రమం సోమవారం రెండో రోజు కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాట్రిసియా స్కాట్లాండ్ కన్హాలోని హార్ట్‌ఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడారు. ఆచరణాత్మక విధానంతో తరగతి గదులకు స్థిరత్వాన్ని తీసుకురావడంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రత్యేక చొరవ తీసుకుంటోందని అభినందించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నా రాజ్‌కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి షబా హయత్

షాద్‌నగర్: విద్యార్థుల కంటి పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి షబా హయత్ అన్నారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి శరీర భాగంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని అన్నారు. సున్నితమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కళ్లను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పది రోజుల పాటు శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమనగల్లు, శంషాబాద్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ పుష్పలత, చంద్రశేఖర్, రమేష్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా విధానంపై బహిరంగ విచారణ

లక్డీకాపూల్: హైదరాబాద్ జిల్లాలో విద్యా విధానంపై తెలంగాణ విద్యా కమిషన్ బహిరంగ విచారణను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో పబ్లిక్ హియరింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

గ్రేటర్ ఇమేజ్‌ను పెంచుదాం

బంజారాహిల్స్: దేశవ్యాప్తంగా హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకు నగరంలో సుందరీకరణ పనులను చేపట్టినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం రోడ్డు నంబర్.45, షేక్‌పేట నాలా జంక్షన్ వద్ద మొత్తం రూ.49 లక్షల వ్యయంతో సుందరీకరించిన జంక్షన్లను మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు పర్యాటక రంగంలో అంతర్జాతీయ నగరంగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో ఇమేజ్‌ను మరింత పెంచాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నట్టు తెలిపారు. నగరవ్యాప్తంగా రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 106 ప్రదేశాల్లో పనులను చేపట్టే లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 78 పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. షేక్‌పేట నాలా వద్ద రూ.24 లక్షల వ్యయంతో చేపట్టగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.45 వద్ద చేపట్టిన సుందరీకరణ పనులకు రూ.25 లక్షల వ్యయంతో చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీసీ ప్రశాంతి, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజకీయాలొద్దు

- అంతా కలిసి పనిచేయాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డీకే అరుణ, చిత్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఎన్నికల వరకే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.28 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణాలు అభివృద్ధి చెందితేనే దేశం త్వరితగతిన ప్రగతి సాధిస్తుందని తెలిపారు. పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. అమృత్ పథకంలో భాగంగా లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. పట్టణాల్లో 24 గంటలు తాగునీరు అందించేందుకు అమృత్ పథకాన్ని చేపట్టిందని అన్నారు. మంజూరైన నిధులతో ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. పార్టీలు వేరైనా అభివృద్ధి విషయంలో నియోజకవర్గ పరిధిలోని అందరు ఎమ్మెల్యేలతో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు నాయక్, చెంది తిరుపతిరెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జమృత్‌ఖాన్, శ్రావణి, ఇబ్రహీం, ఎంకనోళ్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహేశ్వరం: కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు తప్పకుండా ఉంటుందని రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. ఘట్టుపల్లి శివారులోని కోరుపోలు చంద్రారెడ్డి రిసార్ట్స్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం సోమవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఓపిక, నిబద్ధత, క్రమశిక్షణ, సమన్వయంతో పని చేసే నాయకులకు పార్టీ, నామినేటెడ్ పదవులు వరిస్తాయన్నారు. ప్రతి యూత్ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యే, నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని ఆయన సూచించారు. రాబోయే కాలం యూత్ కాంగ్రెస్‌దే అన్నారు. అంతకు ముందు జాతీయ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీకృష్ణ అల్లవారు, అధ్యక్షుడు ఉదయ్‌భాను ఛిబ్ 'చలో పంచాయతీ వార్డు 2025, నా ఓటు–నా బాధ్యత' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేన రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరుపోలు రఘుమారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి వీరరాఘవరెడ్డి

- అనుమతించిన కోర్టు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని మూడు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పోలీసులు అతన్ని విచారించనున్నారు. ఈ నెల 7న రామరాజ్యం సైన్యం పేరుతో వీరరాఘవరెడ్డితో పాటు మరో 25 మంది చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్ ఇంట్లో ఆయనపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని ఈ నెల 8న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు పంపారు. ఈ కేసులో కీలక విషయాలను రాబట్టేందుకు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన కోర్టు కస్టడీకి అనుమతి ఇచ్చింది. మంగళవారం పోలీసులు అతన్ని చర్లపల్లి జైలు నుంచి కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు 18 మందిని అరెస్టు చేసిన పోలీసులు మరో 8 మంది నిందితులకోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గాలిస్తున్నారు.

ప్రజల గుండెల్లో కేసీఆర్

ఎమ్మెల్యే సబితా రెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న సబితా రెడ్డి

మీర్‌పేట: ఫ్లెక్సీలు చించినంత మాత్రాన ప్రజల గుండెల్లో నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తొలగించలేరని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి అన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం మీర్‌పేట మంత్రాల చెరువు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 14 ఏళ్ల అన్ని వర్గాలు, సంఘాలను ఒక్క తాటిపైకి తెచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన యోధుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. పదేళ్ల రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు లలితానగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, అనిల్‌యాదవ్, అర్కల కామేశ్‌రెడ్డి, జటావత్ శ్రీనునాయక్, రజాక్, దిండు భూపేష్‌గౌడ్, సిద్ధాల లావణ్య, దోమలపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహావిష్కరణ

మీర్‌పేట కార్పొరేషన్ 39వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాదరి సురేఖ రమేష్ ఆధ్వర్యంలో జిల్లెలగూడ కమలానగర్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గజ్జెల రాంచందర్, మాదరి శ్రీనివాస్, లప్పు లక్ష్మణ్, బాలకృష్ణ, ఎస్.శ్రీనివాస్, బొజ్జ భాస్కర్, జి.శైలేందర్, గౌతం, ఎస్.హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షకు అంతా సిద్ధం

- నేడు ఆమనగల్లుకు మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నాయకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

ఆమనగల్లు: ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆమనగల్లు పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు దీక్షకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారు. కార్యక్రమానికి అనుమతి కోరగా మొదట పోలీసులు నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ నాయ కులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆమనగల్లు పట్టణ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో పార్టీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను సోమవారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ తదితరులు పరిశీలించారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

- వేసవిలో ఎక్కడా ఇబ్బంది రావొద్దు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పైపులైన్లకు మరమ్మతులు చేయించి, లీకేజీలను నియంత్రించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. వేసవిలో నీటి సరఫరాలో ఎక్కడ సమస్యలు ఉత్పన్నమవుతాయో గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ, మండల, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా పని చేయాలన్నారు. జిల్లాలో గ్రౌండింగ్ అయిన పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రజావాణికి 64 ఫిర్యాదులు

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు అందజేసిన అర్జీలను అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 41, ఇతర శాఖలకు సంబంధించి 23 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు అందించే వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

అభివృద్ధి ఘనత ఆయనదే



ఇబ్రహీంపట్నంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను సాకారం చేసిన ఉద్యమనేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మరువరని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధపడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. అనివర్గాలు, ప్రాంతాల ప్రజలకు సమ న్యాయం చేసి అభివృద్ధి దిశగా పాలన కొనసాగించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని.. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. స్ఫూర్తి జ్యోతి అంధుల ఆశ్రమంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, మాజీ ఎంపీపీ కృపేష్, ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’కి అభాగ్యురాలు

- చేరదీసిన అధికారులు
- సఖి సెంటర్‌కు తరలింపు


మహిళను తీసుకెళ్తున్న అంగన్‌వాడి సూపర్‌వైజర్ పల్లవి, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: చేతిలో ప్లాస్టిక్ సంచి, అందులో పాత గుడ్డలతో పాటు ఆధార్, డిజేబుల్డ్ (దివ్యాంగుల) జిరాక్స్ పత్రాలు, కిరాణా దుకాణానికి నిధులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి రాసిన లేఖతో ఓ అభాగ్యురాలు సోమవారం ప్రజావాణి కార్యక్రమం వద్దకు వచ్చింది. ఆర్డీఓ అనంతరెడ్డి ఏం కావాలని అడిగినా సమాధానం చెప్పలేకపోవడంతో సిబ్బందిని పిలిపించి ఆమె సమస్యను తెలుసుకోవాలని సూచించారు. దీంతో వారు వెళ్లి చేతిలోని సంచిని పరిశీలించగా.. అండేకార్ స్వర్ణలత, వయస్సు 44, తుర్కయంజాల్ వివరాలతో ఆధార్ కార్డుజిరాక్స్, దివ్యాంగురాలిగా పేర్కొన్న డిజేబుల్డ్ జిరాక్స్ కార్డు లభించాయి. దీంతో తుర్కయంజాల్ పరిధిలోని పలువురికి ఫోన్ చేసి వివరాలు కనుక్కునే ప్రయత్నం చేశారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వడంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పల్లవి అక్కడికి చేరుకున్నారు. సదరు మహిళను పలుమార్లు ప్రశ్నించగా.. తన స్వగ్రామం మండల పరిధిలోని పోచారం అని ఒక సారి, మహబూబ్‌నగర్ జిల్లా అని మరోసారి చెప్పింది. తనకు ట్రై సైకిల్ కావాలని, తాను బస్టాండ్ల వద్ద ఉండి జీవనం కొనసాగిస్తున్నానని తెలిపింది. తినడానికి తిండి, ఉండేందుకు చోటు ఉంటే సరిపోతుందని, తనకు రావాల్సిన దివ్యాంగుల పింఛన్ అందడం లేదని పేర్కొంది. దీంతో ఆమెను సఖి సెంటర్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

సుభాష్ నగర్: కరెంటు తీగను కట్ చేస్తుంగా విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కైసర్ నగర్ చెందిన మహమ్మద్ అలీమ్ ఖాన్ కుమారుడు ఎజాజ్ హలీమ్ ఖాన్ (13) కరెంట్ పని చేసేవాడు. సోమవారం సాయంత్రం అతను నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో కరెంట్ తీగను కట్ చేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదివింది ఎంటెక్... చేసేది చీటింగ్స్!

- మోసాల కోసం ఐటీ కంపెనీనే స్థాపించిన వైనం
- ఉద్యోగాల పేరుతో పలువురికి ఎర
- అడ్వాన్సులు, డిపాజిట్లంటూ భారీగా వసూళ్లు
- నిందితుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: ఎంటెక్ చదివిన ఓ వ్యక్తి కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేసి వాటిలో జరిగే ఎంపిక ప్రక్రియ తెలుసుకున్నాడు. ఆపై తానే సొంతంగా ఓ డమ్మీ కంపెనీ ఏర్పాటు చేసి ఉద్యోగాల పేరుతో ఎర వేశాడు. నిరుద్యోగుల నుంచి అందినకాడికి దండుకుని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లతో మోసం చేశాడు. ఇతడిపై ఇప్పటివరకు నాలుగు కేసులు నమోదు కావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. చింతల్ వెంకటేశ్వర నగర్‌కు చెందిన కె.భార్గవ్ ఎంటెక్ పూర్తి చేసి కొన్ని ఐటీ కంపెనీల్లో హెచ్ఆర్ మేనేజర్‌గా పని చేశాడు. ఇలా ఇతడికి ఆయా కంపెనీల్లో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పడింది. దీనిని క్యాష్ చేసుకోవాలని భావించిన అతను ఐటీ ఉద్యోగాల పేరుతో మోసాలకు తెరలేపాడు. ఇందులో భాగంగా హైటెక్ సిటీ వద్ద ఓ కార్యాలయాన్నీ అద్దెకు తీసుకుని అందులో నియోజెన్ సాఫ్ట్‌టెక్ పేరుతో కార్పొరేట్ లుక్‌తో ఆఫీస్ ఏర్పాటు చేశాడు. అందులో కొందరిని ఉద్యోగులుగా నియమించడంతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్ డిజైన్ చేశాడు. తన కార్యాలయం ఫొటోలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచాడు. క్లౌడ్ సర్వీసెస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, వెబ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ రంగాల్లో వివిధ ఉద్యోగాలు ఉన్నట్లు ఆన్‌లైన్‌లోనే ప్రకటన ఇచ్చాడు. జూనియర్ డెవలపర్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్ తదతర ఉద్యోగాలకు ఆకర్షణీయమైన వేతనాలు ఇస్తామని పేర్కొన్నాడు. కొందరు ఉద్యోగార్థులు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేసి ఈ కంపెనీ వెబ్‌సైట్, అందులో ఉన్న ఫొటోలు చూసి పెద్ద కంపెనీగా భావించారు. దరఖాస్తు చేసిన వారికి కన్సల్టెంట్స్ ద్వారా శిక్షణ కూడా ఇప్పించాడు. ఆపై ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి కొందరు ఎంపికైనట్లు ప్రకటించాడు. వీరికి ఈ–మెయిల్ ద్వారా జాబ్ ఆఫరింగ్ లెటర్లు పంపి... వారి నుంచి అడ్వాన్సులు, డిపాజిట్ల పేరుతో రూ.లక్ష, రూ.2 లక్షలు చొప్పున వసూలు చేశాడు. భారీ మొత్తం దండుకున్న తర్వాత తన కార్యాలయం మూసేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇతడి చేతిలో మోసపోయిన వారి ఫిర్యాదుతో లాలాగూడ, జీడిమెట్ల, మాదాపూర్, కల్వకుర్తి ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. భార్గవ్ ఆచూకీ కనిపెట్టడానికి మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రూ.లక్ష నగదు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, గుర్తింపు కార్డులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని లాలాగూడ పోలీసులకు అప్పగించారు. ఈ మోసాలు చేయడంలో ఇతడికి సహకరించిన వారు మరికొందరు ఉన్నారని గుర్తించిన టాస్క్‌ఫోర్స్ వారి కోసం గాలిస్తోంది.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

ఆరుగురు యువకుల అరెస్ట్

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఆరుగురు యువకులు ఓ కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బోరబండ అన్నానగర్ సైట్–3లో నివసించే ప్రసాద్ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఓ వీవీఐపీకి డ్రైవర్‌గా అటాచ్ అయ్యాడు. ఆదివారం రాత్రి అతను ఇందిరానగర్‌లోని అమృతాబార్ నుంచి బయటికి వచ్చాడు. అదే సమయంలో ఇద్దరు యువకులు గొడవపడుతుండటంతో అక్కడికి వెళ్లిన ప్రసాద్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వారు నీవెవరు మాకు చెప్పేందుకు అంటూ అతడిపై దాడి చేయడమే కాకుండా తమ స్నేహితులు మరో ఐదుగురిని అక్కడికి పిలిపించారు. అకారణంగా ఏడుగురు కలిసి ప్రసాద్‌ను చితకబాదడమే గాక అతడి మెడలో ఉన్న బంగారు గొలుసు, రిస్ట్‌వాచ్ లాక్కున్నారు. అదే సమయంలో పోలీసు వాహనం వస్తుండటాన్ని గుర్తించిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే బాధితుడు స్కూటర్ నెంబర్ నోట్ చేసుకుని పోలీసులకు అందజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను శ్రీకృష్ణానగర్ ప్రాంతానికి చెందిన తనాల సాయికిరణ్, ప్రణీత్‌గౌడ్, నందిపాటి నవీన్, బండి సత్యకిరణ్, పందగడ శ్రీనివాస్‌గా గుర్తించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సలీం అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాధితుడు అధికార పార్టీకి చెందిన ప్రముఖురాలి వద్ద పని చేస్తుండటంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకున్నారు.

ఉరేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య


రంగనాథ్‌రావు (ఫైల్)

రాంగోపాల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతూ మన స్తాపానికి లోనైన ఓ పోలీస్ కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిటీ పోలీస్ ఐటీసెల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రంగనాథ్‌రావు (36) కళాసీగూడ కామాక్షి దేవాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య గాజుల దాక్షాయణి, కుమార్తె ఉన్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను అందుకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఆదివారం కుమార్తెతో కలిసి బోయిన్‌పల్లిలోని పుట్టింటికి వెళ్లిన అతడి భార్య దాక్షాయణి అక్కడి నుంచి భర్తకు వీడియో కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రాత్రి ఇంటికి వచ్చి చూడగా రంగనాథ్ వెంటిలేటర్ గ్రిల్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీనిపై సమాచారం అందడంతో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వేధింపులు తాళలేకే..

యువకుడి హత్య కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలో ఆదివారం జరిగిన దారుణ హత్య కేసులో నిందితులను మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటి రెడ్డి వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా, సోమారపుపేట గ్రామానికి చెందిన గుగులోతు గన్యా పెద్ద కుమారుడు ఉమేశ్ (24) మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన అతడి సోదరుడు రాకేశ్, చిన్నాన్న కుమారుడు లక్ష్మణ్, బంధువులు బుక్యా నవీన్ బుక్యా నరేశ్, బుక్యా సురేశ్‌తో కలిసి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ కాలనీలోని అతడి ఇంటిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సందర్భంగా నవీ, నరేశ్, సురేశ్ ఉమేష్‌ను పట్టుకోగా రాకేశ్, లక్ష్మణ్ కత్తులతో దాడి చేశారు. వారి నుంచి తప్పించుకున్న ఉమేష్ పారిపోతుండగా అతడిని వెంబడించిన రాకేశ్, లక్ష్మణ్ మేడ్చల్ బస్ డిపో ఎదుట జాతీయ రహదారిపై కత్తులతో పొడిచి హత్య చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మేడ్చల్ పోలీసులు సోమవారం ఉదయం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు ఉమేశ్‌కు నేర చరిత్ర ఉందని, అతడిపై కామారెడ్డి జిల్లాలో 14 కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును గంటల వ్యవధిలో ఛేదించిన ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, డీఐ సుధీర్ కృష్ణ, ఎస్సై మన్మథరావును డీసీపీ అభినందించారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ::AT:: SHADNAGAR
O.S.No. 394 OF 2024
BETWEEN:-
Smt. Gangamoni Lavanya ...Petitioner/Plaintiff
And
1. The Tahsildar, Kondurg, Rangareddy Dist.
2. To whom so ever it may concern ... Defendants
NOTICE
Take notice that, the above named petitioner/Plaintiff Smt. Gangamoni Lavanya D/o Late. G. Lingaiah, w/o Pilli Venkatesh, age 43 years, Occ: House - wife, R/o Flot No. 392, Snehitha Hills, Near TSSPA Police Academy, hyder shakote, Rangareddy Dist. filed a suit on the file of Hon'ble PRL Junior Civil Judge at Shadnagar seeking the declaration to declare the plaintiff as legal heirs of the deceased Late. Gangamoni Balakistamma w/o Lingaiah, R/o H.No. 27-116, Vivekananda Colony, Farooqnagar Proper & Mondal, Shadnagar Municipality, Rangareddy Dist.
In consideration of the said petition the Hon'ble court pleased the pass its orders on 03-02-2025 in this case vide I.A. No.65/2025 directing the under signed to publish the notice in daily Telugu news paper (Sakshi) calling objections if any to anybody in declare the plaintiff as legal heirs of the deceased Late. Gangamoni Balakistamma W/o G. Lingaiah and if such any person or persons may have any objections such person(s) should appear before the Hon'ble court on the next date and hearing 03-03-2025, 10:30 AM failing which the Hon'ble court will proceed with the case basing on the records of the case. Hence the Notice.
AS FOR THE ORDER OF THE HON'BLE COURT
Sd/- RAMESH BABU NARANI
ADVOCATE & NOTARY #13-228/A/7, Officer's Colony, Shadnagar-509216, R.R Dist. Appointed By Govt. of T.S., INDIA

పార్టీల మధ్య ఫ్లెక్సీల వివాదం

- బ్యానర్ల తొలగింపుపై బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- కమిషనర్ సరస్వతికి ఫిర్యాదు


కమిషనర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదంగా మారింది. ఇదెలా జరిగిందంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఫ్లెక్సీల విషయంలో అధికార పార్టీ నేతలు కావాలనే రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు సైతం కాంగ్రెస్ వారికే మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ శ్రేణులు.. రోడ్లకు ఇరువైపులా కటౌట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. ఆదివారం రాత్రికిరాత్రే వాటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. దీంతో గులాబీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. సోమవారం కమిషనర్ సరస్వతికి ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బ్యానర్లు తొలగించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీల కతీతంగా విధులు నిర్వహించాలని కమిషనర్‌కు సూచించారు. మరోసారి ఇలాంటివి జరిగితే.. ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఆమె.. ఫ్లెక్సీలు ఎవరు, ఎందుకు తొలగించారో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ అర్జున్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్, రిమాండ్


నిందితుడు నాగశేషు

కడ్తాల్: పార్కింగ్ చేసిన ఆటోను అపహరించిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూర్ మండలం నేదునూర్ గ్రామానికి చెందిన సదానందంగౌడ్, రామచంద్రయ్య ఇరువురు ఆటోలో ఈ నెల 9న మండల కేంద్రంలోని అగస్త్య ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చారు. ఆస్పత్రి ఎదుట ఆటోను పార్కింగ్ చేసి, వైద్యం చేయించుకుని వచ్చేసరికి ఆటో కనిపించలేదు. వెంటనే డ్రైవర్ సదానందంగౌడ్.. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. క్రైమ్ టీం సిబ్బంది రాజశేఖర్, రాంకోటీలు సోమవారం మండల కేంద్రంలోని తలకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కోమటికుంటకు చెందిన నాగశేషు అనుమానస్పదంగా వ్యవహరించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం ఒప్పుకున్నాడు. అనంతరం అతన్ని అరెస్టు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నాగశేషును రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచి, జైలుకు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ టీం సిబ్బందికి పోలీసు ఉన్నతాధికారులు అభినందించినట్లు సీఐ వెల్లడించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

షాద్‌నగర్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అదే బాటలో నడుస్తోందని ధ్వజమెత్తారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనందం, బండి విజయ్‌కుమార్, కార్యదర్శి జగదీశ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, జిల్లా కార్యదర్శి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు మల్లేశ్, నరేశ్, నరసింహారెడ్డి, ఆంజనేయులు, భరత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

- నిందితుడి రిమాండ్
- భారీగా సర్టిఫికెట్ల స్వాధీనం

ఫిలింనగర్: నకిలీ సర్టిఫికెట్ల విక్రయ ముఠా గుట్టును ఫిలింనగర్ పోలీసులు బట్టబయలు చేశారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన వజాహత్ అలీ (27) టోలిచౌకీలో నివాసం ఉంటున్నాడు. అతను అవసరమైన వారికి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతడిపై నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి షేక్‌పేట నాలా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వజాహత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు భారీగా నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

విదేశాలకు వెళ్లే వారే టార్గెట్..

దుబాయ్, కువైట్, మస్కట్, సౌదీ ఆరేబియా, బెహ్రైన్, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్లే యువకులు అందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం వజాహత్‌ను సంప్రదించేవారు. దీంతో అతను తనకు పరిచయస్తుడైన రఫీవుల్లాతో సంప్రదింపులు జరిపి సర్టిఫికెట్లు అవసరమైన వారి సమాచారం, యూనివర్సిటీ వివరాలు అందజేసేవాడు. వాటిని రఫీవుల్లా మలక్‌పేటలోని ఫ్లై అబ్రాడ్ కన్సల్టెన్సీలో పని చేసే హబీబ్‌కు అందజేసేవాడు. హబీబ్ వాటిని ఖాన్‌పూర్‌కు పంపడంతో అక్కడ ఉన్న నకిలీ సర్టిఫికెట్ల తయారీదారు సదరు వివరాలతో అవసరమైన యూనివర్సిటీ సర్టిఫికెట్లను ముద్రించి కొరియర్‌లో నగరానికి పంపేవాడు. ఇందుకు గాను ఒక్కో సర్టిఫికెట్‌కు వజాహత్ రూ.80 వేల వరకు వసూలు చేసేవాడు. అందులో రూ.10 వేలు కమీషన్ తీసుకుని మిగతా రూ.70 వేలు రఫీవుల్లాకు అందజేసేవాడు. రఫీవుల్లా రూ.10 వేలు కమీషన్ తీసుకుని రూ.60 వేలు హబీబ్‌కు ఇస్తే, అతను రూ.20 వేలు మినహాయించుకుని రూ.40 వేలు ఖాన్‌పూర్‌లో ఉంటున్న నకిలీ సర్టిఫికెట్ల తయారీదారుడికి ఇచ్చేవాడు. ఈ తరహాలో వీరు ఆంధ్రా యూనివర్సిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, సింబియాసిస్ యూనివర్సిటీ తదితర 20 ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లను అచ్చు గుద్దినట్లు తయారుచేసి విక్రయిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది. నిందితుడు వజాహత్‌ను అరెస్టు చేసిన పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ సీజ్

దోమ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ లారీని పోలీస్‌లు సీజ్ చేశారు. ఈ ఘటన బొంరాస్‌పేట మండలం బొట్లబోని తండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన రమావత్ దేశ్యానాయక్ తండ్రి హీర్యానాయక్(44) తనకున్న టిప్పర్‌తో ఇసుక వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన ఆదివారం రాత్రి బుద్లాపూర్ మీదుగా ఇసుక తీసుకెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు లారీని పట్టుకుని అనుమతి పత్రాలు, వాహన పేపర్లను పరిశీలించగా ఏవీ లేవని సమాధానం వచ్చింది. దీంతో పోలీసులు టిప్పర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సోమవారం పోలీసులు దేశ్యానాయక్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని తహసీల్దార్‌కు అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

నేడు వాహనాల వేలం

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఉన్న వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ సహదేవుడు ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులకు ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10–30 నిమిషాలకు కార్యాలయానికి రావా లని సూచించారు. ఈ వాహనాలు నిషేధిత వస్తువుల నేరాలకు సంబంధించి సీజ్ చేసినవిగా ఆయన తెలిపారు.

బాలుడి చేతిలో యువకుడి దారుణ హత్య


వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: మద్యానికి బానిసైన ఓ యవకుడు తన కుటుంబ సభ్యులను వేధిస్తుండటంతో ఆగ్రహానికి లోనైన ఓ బాలుడు తన మేనత్త కొడుకు(బావ)ను దారుణంగా హత్య చేసిన సంఘటన సోమవారం మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం, రాఘవేంద్ర నగర్ కాలనీలో రాధ తన తండ్రి జంగయ్య, ఇద్దరు కుమారులు శ్రీనివాస్, వెంకటరమణ(30), తమ్ముడి కుమారుడి(16)తో కలిసి నివాసం ఉంటోంది. వెంకటరమణ కిష్టాపూర్, అర్చన కాలనీ శివాలయంలో పూజారిగా పని చేసేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అర్చక వృత్తిని వదిలేసిన అతను కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఐదు రోజుల క్రితం రాధ, తండ్రి జంగయ్యతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లగా, ఇంట్లో వెంకటరమణ ,అతని బావమరిది అయిన మైనర్ బాలుడు ఉన్నారు. ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే అప్పటికే అతడి వైఖరితో విసిగిపోయిన బాలుడు వెంకటరమణను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి నిద్రిస్తున్న వెంకటరమణను కత్తితో గొంతు నరికి హత్య చేశాడు. సోమవారం ఉదయం మృతుడి సోదరుడికి ఫోన్ చేసి వెంకటరమణ మృతి చెందినట్లు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మైనర్ బాలుడే హత్యకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HMDA అప్రూవ్డ్ శ్రీశైలం హైవే ఫేసింగ్ కందుకూరు దగ్గర వెంచర్‌లో ప్లాట్లు అమ్మబడును. రెడీ టూ కన్‌స్ట్రక్ట్. Ph: 8309376230 [SCA25001752]

COMMERCIAL
FOR LEASE: Office Space Available at Banjarahills Road No-03, 2000 Sft Plug and Play. Contact: 9849438140, 9292105575 [HA-15140]

HOUSE FOR SALE
Karmanghat near main road House for Sale. G+1 = 2BHK + 3BHK 200 yards West Face 30 Feet road Ph: 9885202404 [HA-1053]

Services

BUSINESS SERVICE
మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]
మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

PERSONAL CARE

CHANGE OF NAME
I, MEENA BAI W/o. DHYANESHWAR, R/o H.No.4-7-156/3/83/1, Panduranga Nagar, Rambagh, Rajendra Nagar, Ranga Reddy Dist-500048, TS. I have Changed my name from MEENA BAI to MEENA BAI KHONDE for all the purposes [SCA25001758]

I, Palwai Upender Reddy S/o Raghuma Reddy Palvai Resident of Flat No.203 Sri Sai Sudha Enclave, KNR Colony, Nizampet, Hyd, has changed my name as UPENDER REDDY PALVAI for all purposes [SCA25001753]
I, Usha Vaidyanathan, D/o. Late. R.V. Nathan, Regimental No. 06855569. R/o. Plot No. 133, Flat No. FF-3, Hardev Chanikya Residency, Saptagiri Colony, Neredmet, Malkajgiri, Medhchal-Malkajgiri Dist - 500094, T.S., my Incorrect name: R.V.G. Usha Bai & Correct Name is Usha Vaidyanathan (for all future purposes) [SCA25001759]
I, M Spandhana W/o, Vanga Yashwanth Reddy R/o 3-100/106, Sri Balaji Heights, Jayabheri Park, Kompally, Hyderabad, Telangana - 500014, have changed my name to Vanga Spandhana Reddy. [DA-41320]
I, Pattabhi Ramaiah Sykam S/o, Pitchi Reddy Sykam R/o Flat No. 405, Pt No. 397, 398, Sri Dinesh Castle, Nizampet, Medchal -Malkajgiri - 500090 have changed my name to Pattabhi Ram Reddy Sykam for all purposes. [DA-13277]

OLD AGE HOME
వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783368]

Wanted
ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీ।। 15-25K హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. 8019373131/040-45043410 [H-800524]

శ్రీ సాయిరామ్ హోమ్‌కేర్, హైదరాబాద్‌లో బేబీ కేర్, పేషెంట్‌కేర్, ముసలివాళ్ళకు ఆయాలు, నర్సులు & ఇంటిపని, వంటపనికి మనుషులు కావలెను. జీ: 18 వేలు ✆ 9949094607, 99084 54607 [B-8534]
Wanted Exp Sales Executive for Textiles Wholesaler, Auto Drivers, Helpers @ Sec-Bad. Ph: 8801805758 [HA-6254]

FACULTY TEACHERS
Wanted All Sub Teachers Nursery-X Maha Guru School Attractive Salary. Cont: Principal 9989020028 HF Nagar Rahmat Nagar [SCA25001663]
Voxpop International School @ Miyapur is Hiring Qualified, Trained & Experienced Teachers for All Subjects from PP to X Grade with decent salary. Graduates & Post Graduates with PPTC, B.Ed & 5yrs Experience can Walkin: PP & Primary: 1/03/2025 & 2/03/2025: 9am-2pm Middle & Higher: 8/03/2025 & 9/03/2025: 9am-2pm. Ph:9701511567. [HA-15145]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
జోన్ సెంటర్స్
దిల్‌సుఖ్‌నగర్ 9912348016 | రాజేంద్రనగర్ 9010202372
ఎల్.బి.నగర్ 9912225475 | కూకట్‌పల్లి 9912225476
అబ్బార్క 9010202751 | బాలానగర్ 9951602997
సికింద్రాబాద్ 9010299013 | మల్కాజ్‌గిరి 9505507562
చిక్కడపల్లి 9912225453 | మెహదీపట్నం 9912225468
అబిడ్స్ 9705144457 | చందానగర్ 9912225453
అమీర్‌పేట్ 9505507563 | ఉప్పల్ 7095250115
వివరాలకు: 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453